Follow: @mahaadaily
REGISTERED NUMBER: APTEL/2014/58382
05-12-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 346 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
శుక్రవారం
WWW.EPAPER.MAHAADAILY.COM



# భారత్‌కు పుతిన్

## ఘన స్వాగతం పలికిన ప్రధాని మోదీ

### ప్రొటోకాల్ పక్కకుపెట్టి.. ఎయిర్ పోర్ట్ లో స్వాగతం

**ఢిల్లీ, మహా:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాలుగేళ్ల తర్వాత రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ చేరుకోగా, ప్రొటోకాల్ పక్కనపెట్టి ప్రదాని మోదీ ఘనస్వాగతం పలికారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6గంటలా 40 నిమిషాలకు ఆయన విమానం ఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ప్రధాని మోదీ అంతకుముందే పాలం విమానాశ్రయానికి చేరుకున్నారు. పుతిన్‌కు స్వాగతం పలికేందుకు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టారు. స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలికారు. విమానాశ్రయంలోనే ఏర్పాటు చేసిన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను పుతిన్ తిలకించారు.


మిగతా 2లో

టాప్ న్యూస్



తెలంగాణ రైజింగ్‌కు
## బాలీవుడ్ గ్లామర్
- గ్లోబల్ సమ్మిట్‌కు సల్మాన్ ఖాన్

02



యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న
## పేరుగల్ల పెద్దిరెడ్డి
- దుమ్ము పేరుతున్న నాగదుర్గ సాంగ్

02



తిరుమల లడ్డూపై
## చంద్రబాబుది దుష్ప్రచారం
- చంద్రబాబుకు దేవుడంటే భయం, భక్తి లేవు
- వైసీపీ అదినేత జగన్ సంచలన వ్యాఖ్యలు

02



# ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్ తెస్తా...

## వచ్చే ఏడాది విమానాశ్రయ పనులు ప్రారంభిస్తా..

ప్రాణహితను ప్రారంభిస్తా.. ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేస్తా

ఆదిలాబాద్ కు కొమరంభీం పేరుతో యూనివర్శిటీ ఏర్పాటు చేస్తా

ఆదిలాబాద్ జిల్లాపర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు

సీసీఐ, ప్రాణహిత అనుమతుల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తాం..

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు

కల్వకుంట్ల కుటుంబంలో పైసల పంచాయతీ.. ఒకరినొకరు పొడుచుకుంటున్నరు





**ఆదిలాబాద్, మహా:**

ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి పరిశ్రమలు తీసుకువచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండు సంవత్సరాల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజాప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

మిగతా 2లో

# సీఎం సభ సూపర్ హిట్

## ఆదిలాబాద్ సభకు జన స్పందనపై సీఎం హర్షం

### మంత్రులు, నేతలకు అభినందనలు

**ఆదిలాబాద్, మహా:** మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ సభ సూపర్ హిట్ అయింది. ఆదిలాబాద్ సభకు పెద్ద ఎత్తున జనం హాజరుకావడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. తాను ఇప్పటిదాకా హాజరైన అన్ని సభల కంటే ఆదిలాబాద్ సభకు జనం బాగా వచ్చారని సీఎం సభావేదికపైనే ప్రకటించారు. సీఎం మాట్లాడినపుడు కూడా ప్రజలు హర్షధ్వనాలు ప్రకటించారు. సభకు పెద్ద ఎత్తున స్పందన వ్యక్తం కావడంపై మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఇన్ ఛార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి గత మూడురోజులుగా ఆదిలాబాద్ సీఎం పర్యటన విజయవంతానికి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో నేతలు పలు సమావేశాలు నిర్వహించి కార్యక్రమం విజయవంతమయ్యేలా జనసమీకరణ చేశారు. సభా ప్రాంగణం నిండిపోవడంతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు సీట్లు లేక నిలబడి పోయారు. ఇందిరాప్రియదర్శిని స్టేడియం లో సభ జరగ్గా, సీఎం సభ విజయవంతమైన జోష్ లోనే వరాలు కురిపించారు.

# శ్రీనూ.. నేనున్నా

## ఆదిలాబాద్ నేతకు సీఎం భరోసా

### సీఎంకు ఘనస్వాగతం

**ఆదిలాబాద్, మహా:** ప్రజాపాలన విజయోత్సవాల కోసం ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించగా, సీఎం భుజంపై చేయి వేసి నడుస్తూ ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు తెలుసుకుని నేనున్నా.. అంటూ భరోసానిచ్చారు. ఆదిలాబాద్ లో పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సరైన సమయంలో సరైన అవకాశాలొస్తాయని, ఆదిలాబాద్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. నేతలు పెద్ద ఎత్తున సీఎంకు స్వాగతం పలకగా, సభకు కూడా బారీగా ప్రజలు హాజరయ్యారు.



## హిల్ట్ పై కేటీఆర్ పోరుబాట

- పారిశ్రామిక వేత్తలు తొందరపడి కొనకండి
- మేం వచ్చాక రద్దు చేయడం ఖాయం
- కుత్బుల్లాపూర్, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో పర్యటన

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ ఫర్మేషన్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట చేపట్టింది. మొత్తం ఎనిమిది క్లస్టర్లుగా కీలక నేతలను నియమించారు. ప్రతి క్లస్టర్ కూడా నిర్ణీత ప్రాంతాల్లో పర్యటించి నిజనిర్ధారణ చేయనుందని బీఆర్ఎస్ వెల్లడించింది. ఇందులో భాగంగానే కేటీఆర్ బృందం గురువారం కుత్బుల్లాపూర్,

మిగతా 2లో

## బీజాపూర్ అడవుల్లో మళ్లీ ఎన్ కౌంటర్

- కాల్పుల్లో 20 మంది మావోయిస్టులు మృతి
- 18 మంది మావోయిస్టు మృత దేహాల స్వాధీనం
- అమరులైన ముగ్గురు పోలీసులు

వివరాలు 3లో

## క్వాంటం సిటీగా హైదరాబాద్

- దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"
- స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

02

కోటి రూపాయల వెండి మండపంతో
## మోపిదేవికి శోభ!

స్వామివారికి 49 కేజీల రజత కానుక సమర్పణ

- మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి పాను పట్నంపై మెరిసిన రజత మండపం
- ఆర్.వి.ఆర్. సంస్థ దాతృత్వం.. మోపిదేవి ఆలయంలో అద్భుత ఘట్టం

03

## సర్కారీ బడిలో సరికొత్త టెన్షన్

03

రంగారెడ్డి కలెక్టరేట్‌లో
## ఏసీబీ దాడులు

- ఏడి సర్వేయర్ శ్రీనివాస్ అరెస్ట్
- ఏకకాలంలో ఆరు ప్రాంతాల్లో ఏసీబీ బృందాల దాడులు
- భారీగా ఆస్తుల గుర్తింపు

వివరాలు 3లో

## అందరివాడు.. అడ్లూరి

### అందుకే.. ఒకేసారి తీన్మార్

- రెండేళ్ళలోనే.. ఎమ్మెల్యే.. విప్.. మినిస్టర్
- సామాన్య కార్యకర్త నుంచి మంత్రి స్థాయికి అడ్లూరి
- ధర్మపురి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర
- ఎమ్మెల్యేగా విజయవంతంగా రెండేళ్ళు పూర్తి



**కరీంనగర్, మహా:** అవమానాలు ఎదురైన చోటే.. తలెత్తుకొని అఖండ విజయం సాధించి ఆయన చరిత్రను తిరగరాసారు. పట్టు వదలని విక్రమార్కుడిలా లక్ష్యాన్ని సాధించి రికార్డు సృష్టించారు. అడ్డంకులు చీల్చుకుంటూ ముందుకు సాగారు. సామాన్య కార్యకర్త నుంచి మంత్రి స్థాయి వరకు ఎదిగారు. ప్రజల కష్ట సుఖాల్లో తోడునీడగా నిత్యం వెన్నంటే ఉంటారు. చేతనైన సహాయాన్ని చేస్తారు. సమస్యల పరిష్కారానికి అంకితమై పనిచేస్తారు. ప్రజల ఇబ్బందులను తన ఇబ్బందులుగా భావిస్తాడు. ధర్మపురి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నాలుగుసార్లు పరాజయం పాలై ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయనను ధర్మపురి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. ధర్మపురి ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాజకీయ ప్రస్థానం ఇది.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచి విజయవంతంగా మూడో సంవత్సరంలోకి అడుగుడిన సందర్భంగా ఎస్సీ ఎస్టీ సంక్షేమ మంత్రి లక్ష్మణ్ కుమార్ గురించి మహా కథనం.

ప్రత్యేక కథనం 4లో







# ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్ తెస్తా...

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమం అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందు కెళ్తున్నామని అన్నారు. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం ప్రజల దీవెన, దేవుడి సంకల్పమని పేర్కొన్నారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదని, ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశామని ఆరోపించారు.

**గత ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించా..**

ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో గత పదేళ్లలో అది నెరవేరలేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటరీ రూపొందించామని, పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం పనులు ప్రారంభం అవుతాయని, ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై తాను పోరాటం ప్రారంభించానని తెలిపారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టానని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు త్వరలోనే మరోసారి వచ్చి పనులను సమీక్షిస్తానని అన్నారు.

**కల్వకుంట్ల కుటుంబంలో పైసల పంచాయతీ**

ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారని సీఎం గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టారని ఆరోపించారు. రీడిజైనింగ్ పేరిట ప్రాజెక్టు స్థలాన్ని మార్చి ఎవరి కోసమో ఎక్కడికో తీసుకెళ్లారని, ప్రాణహిత చేవెళ్లను పక్కకు పడేసి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని అన్నారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరంలా మూడేళ్లకే కూలిందని విమర్శించారు. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ కుటుంబంలో గొడవలు పడుతున్నారని, ప్రజల సొమ్ము దోచుకున్న ఆ కుటుంబంలో పైసల కోసం కొట్లాట జరుగుతోందని ఎద్దేవా చేశారు. పైసల కోసం ఒకరినొకరు పొడుచుకుంటున్నారన్నారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మళ్లీ చేపట్టి ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇస్తామని తెలిపారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మళ్లీ తుమ్మిడి హట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇస్తామని, ఆదిలాబాద్ జిల్లాలో మూతపడిన సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు.

**ఆదిలాబాద్ కు యూనివర్శిటీ ఇస్తా**

ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని సీఎం పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి , ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, ఎమ్మెల్సీ దండె విఠల్ , ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, వెడ్మ బొజ్జు, గడ్డం వినోద్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ,గ్రంథాలయ చైర్మన్లు మల్లెపూల నర్సయ్య, అర్జుమంద్ అలీ, ఆదిలాబాద్ , బోథ్ ,ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇంచార్జిలు కంది శ్రీనివాస రెడ్డి , ఆడె గజేందర్, శ్యాం నాయక్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రైజింగ్‌కు బాలీవుడ్ గ్లామర్

**గ్లోబల్ సమ్మిట్‌కు సల్మాన్ ఖాన్**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు బాలీవుడ్ గ్లామర్ కలిసిరానుంది. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి ఫిల్మ్ స్టూడియోలను ఏర్పాటు చేయాలని సల్మాన్ ఖాన్ యోచిస్తున్నారు. ఈ విషయంపై ఆయన అక్టోబర్ 30న ముంబైలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధిని ప్రశంసించిన సల్మాన్, రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈనెల 8,9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్ కు హాజరుకానున్నారు.



# హిల్ట్ పై కేటీఆర్ పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో పర్యటించింది. ఇందులో భాగంగానే కుత్బుల్లాపూర్‌లోని షాపూర్ దగ్గర హమాలీలతో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ తెరలేపిన భారీ భూ కుంభకోణంపై తాము క్షేత్రస్థాయిలో పోరాడతామని అన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు అన్యాయం జరగనివ్వమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీ పేరుతో 5 లక్షల కోట్ల రూపాయల భారీ భూ కుంభకోణానికి పాల్పడుతోందని పునరుద్ఘాటించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలు వద్దంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నారని విమర్శించారు.



**అవి నిబంధనలతో ఇచ్చిన ప్రజల భూములు**

"ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేట్ వ్యక్తుల భూములు కావు; ప్రైవేట్ వ్యక్తులకు ప్రజల కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములు. కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇవ్వడం జరిగింది. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే, ప్రభుత్వం కేవలం 4,000 రూపాయలకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తోంది. హైదరాబాద్ నగరంలో పేదలకు ఇండ్లకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు, చివరికి స్మశానాలకు కూడా స్థలం లేదు. కానీ, ప్రైవేట్ వ్యక్తులకు 9,300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటోంది" అని పేర్కొన్నారు. "ఈ 9,300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని, అక్కడ కాంగ్రెస్ చెబుతున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూల్స్, ఆసుపత్రులు కట్టాలి. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ కట్టలేదు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలివెళ్తే, హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే ఈరోజు పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నాము. ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిగ్గుతేల్చాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నాము" అని తెలిపారు.

**భూమిని కాపాడే వరకు పోరాటం ఆగదు**

ఈ అంశాన్ని తమ పార్టీ ఇక్కడితో వదిలిపెట్టదని చెప్పారు. హిల్ట్ పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. నగరంలో కాలనీలలో ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామన్నారు. "ఈ పాలసీని వెనక్కి తీసుకొని, లక్షల కోట్ల విలువైన ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం కొనసాగుతుంది. అవసరమైతే న్యాయపోరాటం చేస్తాము. మా ప్రభుత్వం రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాము. అవసరమైతే ఇందుకోసం ఒక చట్టాన్ని తీసుకువస్తాము" అని వ్యాఖ్యానించారు. "ఈరోజు రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నాము. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే, అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోండి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక... తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ఓ తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన మేము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతోంది. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. "ఈరోజు మేము పర్యటిస్తున్న జీడిమెట్ల ప్రాంతంలో మార్కెట్ ధర గజానికి కనీసం లక్ష రూపాయలు ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం 4,000 రూపాయలకే పూర్తిగా భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతోంది. ఒకవైపు 170 కోట్ల రూపాయలకు ఎకరం చొప్పున భూములు అమ్మిన ప్రభుత్వం అంటూ రోజు వార్తలు రాయించుకుంటున్న సర్కార్, మరోవైపు కేవలం కోటి రూపాయలకు ఎకరం చొప్పున జీడిమెట్లలో భూమిని ఎలా అమ్ముతుంది? ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి క్షేత్రస్థాయిలో ఉన్న నిదర్శనం" అని అన్నారు. "మేము గతంలో తెచ్చిన గ్రిడ్ పాలసీ ద్వారా కేవలం ఐటీ కార్యాలయాలు మాత్రమే నిర్మాణం చేసేందుకు అవకాశం ఉండేది. ఐటీ కార్యాలయాల ఏర్పాటు వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయి, పరోక్షంగా అనేకమందికి ఉపాధి లభిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, మా పాలసీ ఆదర్శం అయితే... ఈ పారిశ్రామిక భూములలో ఎలాంటి కాలుష్యం లేని పరిశ్రమలకు మాత్రమే తిరిగి భూములు కేటాయించాలి. ఐటీ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మాత్రమే అనుమతించాలి. అంతేకానీ అప్పనంగా అపార్ట్‌మెంట్లకు, విల్లాలకు ఇస్తామంటే కుదరదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్**

"హైదరాబాద్ నగరం నుంచి కాలుష్య కారక పరిశ్రమలను బయటకి పంపించాలన్నది అందరి ఉద్దేశం. అందుకే ఎలాంటి పొల్యూషన్ లేని అంతర్జాతీయ స్థాయి ఫార్మాసిటీని ఏర్పాటు చేశాము. దాన్ని కూడా రేవంత్ రెడ్డి తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడుకుంటున్నాడు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. రేవంత్ రెడ్డికి తెలిసింది కేవలం రియల్ ఎస్టేట్ దందా మాత్రమే. అందుకే అక్కడ ఫార్మాసిటీలోనూ, ఇక్కడ పారిశ్రామిక భూముల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు" అని ఆరోపించారు.

## యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న పేరుగల్ల పెద్దిరెడ్డి

**దుమ్మురేపుతున్న నాగదుర్గ సాంగ్**

**మహా:** తెలంగాణ జానపద వీడియో సాంగ్స్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో , సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. తండ్రీకూతుళ్ళ అనుబంధం.. పల్లెటూరి జ్ఞాపకాలతో ప్రతి ఒక్కరూ పాతరోజులు గుర్తుచేసుకుంటున్నారు. కూతురి ప్రేమకు ఫిదా అవుతున్నారు. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ గానం చేశారు. సంగీతాన్ని మదన్ కే అందించారు. మిలియన్ల వ్యూస్, టన్నుల కొద్దీ ప్రశంసలతో పాట దుమ్మురేపుతోంది.



## తిరుమల లడ్డూపై చంద్రబాబుది దుష్ప్రచారం

**చంద్రబాబుకు దేవుడంటే భయం, భక్తి లేవు**

**వైసీపీ అదినేత జగన్ సంచలన వ్యాఖ్యలు**

**అమరావతి, మహా:** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని వైసీపీ అధినేత జగన్ స్పష్టం చేశారు. దీనిని పూర్తిగా దుష్ప్రచారంగా అభివర్ణించిన ఆయన, దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. దేవుడంటే భక్తి, భయం లేని చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "కల్తీ నెయ్యి ఆరోపణలు ఉన్న ఆ ట్యాంకర్లు ప్రసాదం తయారుచేసే పోటులోకి వెళ్లాయా? అందుకు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా?" అని సూటిగా ప్రశ్నించారు. టీటీడీలోకి వచ్చే ప్రతి నెయ్యి ట్యాంకర్‌ను కఠినమైన తనిఖీలకు గురిచేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఏబీఎల్ సర్టిఫికేషన్ ఉన్నప్పటికీ, టీటీడీ సొంత ల్యాబ్‌లో కూడా పరీక్షలు పాస్ అయితేనే ఆ నెయ్యిని వినియోగానికి స్వీకరిస్తారని వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ట్యాంకర్లను వెనక్కి పంపడం ఒక సాధారణ ప్రక్రియ అని జగన్ తెలిపారు. గతంలో చంద్రబాబు హయాంలో 17 సార్లు, తమ ప్రభుత్వ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిప్పి పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇంతటి పటిష్టమైన భద్రతా, నాణ్యతా ప్రమాణాలు అమల్లో ఉండగా కల్తీ జరిగిందని ఎలా అంటారని నిలదీశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన ప్రసాదంపై ఆరోపణలు చేస్తున్నారని జగన్ అన్నారు.

## భారత్‌కు పుతిన్

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒకేకారులో వెళ్లారు.

**వ్యూహాత్మక రక్షణ ఒప్పందాలు**

రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం అందుకోనున్నారు. పదకొండున్నరకు రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీ సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో భారత్ రష్యా శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో జలాంతర్గామి లీజుకు సంబంధించిన ఒప్పందం కూడా ఖరారు కావచ్చని తెలుస్తోంది. ఆ ఒప్పందం విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లు అని సమాచారం. ఈ జలాంతర్గామి కోసం పదేళ్లుగా జరిగిన చర్చలు ఎట్టకేలకు పుతిన్ భారత పర్యటన సందర్భంగా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

**సంయుక్త మీడియా సమావేశం**

ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొంటారు. రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే రష్యా టుడే న్యూస్ ఛానెల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఇచ్చే అధికారిక విందులో ఆయన పాల్గొంటారు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు రష్యాకు తిరిగి పయనమవుతారు. పుతిన్ భారత పర్యటన వేళ దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. స్వాట్ బృందాలు, స్నైపర్లను పెద్దఎత్తున మోహరించారు.

# క్వాంటం సిటీగా హైదరాబాద్

- దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"
- స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్, మహా :** "క్వాంటం సిటీ"గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. "క్వాంటం టెక్నాలజీ"లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని "ఐఐఐటీ హైదరాబాద్"లో "నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ"ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్ లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశం చేసే "డైరెక్షన్" అని అన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా "సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్"కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. "ఇండస్ట్రీ డే" పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, మెంబర్ డా. వీకే సారస్వత్, దేబ్ జానీ ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నా భార్యను గెలిపిస్తే ఐదేళ్లపాటు కటింగ్, షేవింగ్ ఫ్రీ

**బార్బర్ బంపర్ ఆఫర్**

**సిద్దిపేట, మహా:** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడి ప్రకటన ప్రస్తుతం ఆ ప్రాంతంలో హాట్ టాపిక్‌గా మారింది. తన భార్యను వార్డు సభ్యురాలిగా గెలిపిస్తే, ఆ వార్డు ఓటర్లందరికీ ఐదేళ్లపాటు ఉచితంగా కటింగ్, షేవింగ్ చేస్తానని ఆయన సంచలన హామీ ఇచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళితే రఘోత్తంపల్లి గ్రామానికి చెందిన శివాని 6వ వార్డు సభ్యురాలిగా పోటీలో ఉన్నారు. ఆమె భర్త శ్రీకాంత్, వృత్తిరీత్యా నాయి బ్రాహ్మణ (మంగలి) కుటుంబానికి చెందిన వారు. తమ వార్డు అభివృద్ధికి నోచుకోలేదని, తమ వార్డుకు ఏదైనా చేయాలనే సంకల్పంతో తన భార్యను వార్డు మెంబర్‌గా పోటీలో నిలిపినట్లు శ్రీకాంత్ తెలిపారు. తమ వార్డు చాలా వెనకబడి ఉందని, తన భార్య శివానిని గెలిపిస్తే తప్పకుండా వార్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు 5 సంవత్సరాల పాటు తమ వార్డులోని ప్రతి ఓటరుకు కటింగ్, షేవింగ్ ఉచితంగా చేస్తానన్నారు. దయచేసి తన భార్యకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్రంలో 2 వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో 3 వ విడత నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భీమారం మండలంలో భీమారం, పోలంపల్లి, ఆరేపల్లి గ్రామాలకు భీమారం గ్రామపంచాయతీ, బూర్గుపల్లి, నర్సింగాపూర్ (బి) గ్రామాలకు బూర్గుపల్లి గ్రామపంచాయతీ, దాంపూర్, ధర్మారం, కాజిపల్లి గ్రామాలకు కాజిపల్లి గ్రామపంచాయతీ లలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సి.ఐ. నవీన్ లతో కలిసి సందర్శించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని సూచించారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులు జాగ్రత్త వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ఎన్నికల సందర్భంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని ఆదేశించారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.

**అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పరిశీలన**

అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించడంతో పాటు సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని వివరించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన కార్మికులకు సీ.ఎం.పి.ఎఫ్. త్వరగా అందిస్తున్నాం

**సీ.ఎం.పి.ఎఫ్. రీజనల్ కమిషనర్ కే గోవర్ధన్**




**మందమర్రి, మహా :** పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులకు సీ.ఎం.పి.ఎఫ్. త్వరగా అందిస్తున్నామని సీ.ఎం.పి.ఎఫ్. రీజనల్ కమిషనర్ కే గోవర్ధన్ అన్నారు. గురువారం మందమర్రి జిఎం కార్యాలయం సమావేశం మందిరంలో సీఎంపిఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ జాప్యం లేకుండా సీఎంపిఎఫ్ సేవలను ఉద్యోగులకు త్వరగా అందించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. సీ.ఎం.పి.ఎఫ్, పెన్షన్ లకు సంబంధించిన లావాదేవిలు అన్నీ సికేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నట్టు తెలిపారు. అలాగే కొత్తగా సీ.ఎం.పి.ఎఫ్ పెన్షన్ కి సంబంధించిన క్లెయిమ్స్ త్వరగతిన పూర్తి చేయడానికి ప్రయాస్ అనే పద్ధతిని తీసుకువచ్చామని అన్నారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ గా సీ.ఎం పి.ఎఫ్ పెన్షన్ సంబంధించిన క్లైములను సెటిల్ చేస్తున్నామని అన్నారు. మధ్యవర్తులు ప్రమేయం లేకుండా సీ.ఎం.పి.ఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని వివరించారు. కార్మికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం మందమర్రి జీఎం, ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రయాస్ ద్వారా సీ.ఎం.పి.ఎఫ్, పెన్షన్ కి సంబందించిన సమస్యలు లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తు చర్యలు తీసుకుంటున్న అధికారులకు ధన్యవాదలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.ఓ.టు జి.ఎం.జి.ఎల్. ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ ఆఫీసు సిబ్బంది, అన్ని గనుల సంక్షేమ అధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గెలిపిస్తే రైల్వే గేటు సమస్య తీరుస్తా...

**సర్పంచ్ అభ్యర్థి దూసరి స్వప్న మురళి**



**ఆలేరు, మహా:** తనను గెలిపిస్తే రైల్వే గేటు సమస్య తీరుస్తానని, గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దూసరి స్వప్న హామీ ఇచ్చారు..... గురువారం గ్రామంలో వార్డ్ అభ్యర్థులు,కాంగ్రెస్ నాయకులు,గ్రామ పెద్దలతో తనకు ఓటు వేయాలని కోరుతో ఓటర్లను కోరుతూ ప్రచారం నిర్వహించారు.. ఈ గ్రామానికే కాదు కడుపుల వున్న బిడ్డ సమస్య కూడ రైల్వే గేటు సమస్య ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో ఆరు నెలల్లో అండర్ పాస్ బ్రిడ్జ్ చేపిస్తామని అన్ని రకాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేసి మండలంలో 16 గ్రామ పంచాయతీలలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానిని అన్నారు ఎన్నికల ప్రచారంలో ఇన్ చార్జ్ ఆలేటి శ్రీకాంత్, దూసరి మురళి,దూసరి విజయ అంజయ్య, ,సోమయ్య,జానీ నాయక్,శివా నాయక్, గంగోత్రి క్రాంతి నాయక్,కల్లూరు రాజు,పర్రె కరుణాకర్,ఎల్లయ్య, రాహుల్, చెక్కిల్ల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి రోషయ్య సేవలు చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి,మహా:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పనిచేసిన కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అధికారులతో కలిసి హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల అధికారులతో సమీక్ష



**యాదాద్రి భువనగిరి, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది కి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు, సాధారణ పరిశీలకులు గౌతమి, సమక్షంలో నిర్వహించారు. గురువారం వీ.సీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, సాధారణ పరిశీలకులు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆలేరు, ఆత్మకూరు, బొమ్మలరామారం, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందిని పోలింగ్ విధులకోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 153 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1286 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1441, ఓ.పీ.ఓలు 1500 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీపీఓ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఎ డి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజాపూర్ అడవుల్లో మళ్లీ ఎన్ కౌంటర్

**చత్తీస్ గడ్, మహా :** బీజాపూర్ అడవుల్లో గురువారం మరో ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. ఘటనా స్థలిలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్ కౌంటర్ తర్వాత ఇదే భారీ ఎన్ కౌంటర్. బుధవారం ప్రారంభమైన ఎన్ కౌంటర్ గురువారం నాటికి భారీ ఎన్ కౌంటర్ గా మారిపోయింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గంగులూరు ప్రాంతంలోని అడవుల్లో ఈ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ నేపథ్యంలోనే బీజాపూర్‌దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. బుధవారం ఇరువర్గాలకు జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) జవాన్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇద్దరు డీఆర్జీ జవాన్లు గాయపడ్డారు .మొత్తంగా బుధ, గురువారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 19 మంది మావోయిస్టులు చనిపోయినట్టు భద్రతా బలగాలు పేర్కొన్నాయి. ఘటనా స్థలంలో మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్దఎత్తున ఆయుధ, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

**మావోయిస్టు నేత మోడియం వెల్లా చనిపోయాడు: బస్తర్ రేంజ్ ఐజీ**

బీజాపూర్‌దంతెవాడ జిల్లాల సరిహద్దు వెంబడి ఉన్న అడవిలో ఈ ఎదురుకాల్పులు జరిగాయని బస్తర్ రేంజ్ ఐజీ తెలిపారు. దంతెవాడ, బీజాపూర్ కు చెందిన డీఆర్జీ సిబ్బంది, స్పెషల్ టాస్క్ ఫోర్స్, చత్తీస్ గడ్ పోలీసు విభాగాలు, కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ సీఆర్పీఎఫ్ ఎలైట్ యూనిట్ ఈ ఆపరేషన్లో కీలకంగా వ్యవహరించాయి. ఎన్ కౌంటర్ లో చనిపోయిన 12 మంది మావోయిస్టుల్లో మోడియం వెల్లాను మాత్రం గుర్తించినట్లు ఐజీ చెప్పారు. మిగిలిన మృతుల గుర్తింపు ప్రక్రియ సాగుతోందన్నారు. వెల్లా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ నెం.2 కమాండర్ గా పని చేస్తున్నాడు. 2020లో సుక్మాలో భద్రతా దళాలపై జరిగిన దాడుల్లో కూడా ఉన్నాడు. గెరిల్లా యుద్ధంలో సిద్ధహస్తుడని పోలీసులు తెలిపారు. ఎన్ కౌంటర్ సందర్భంగా ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరికొంత మంది గాయపడ్డారని, గాయపడిన జవాన్లకు వెంటనే ప్రథమ చికిత్స అందించామని వారికి ప్రాణ భయం లేదని ఐజీ తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్ పరిధిలోని ఈ ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర యాదవ్ తెలిపారు.

**చత్తీస్ గడ్ లో 275 మంది చనిపోయారు**

ఈ ఏడాది ఛత్తీస్ గఢ్ లో జరిగిన ఎన్ కౌంటర్లలో 275 మంది నక్సలైట్లు చనిపోయినట్టు భద్రతా బలగాలు పేర్కొన్నాయి. వీరిలో బీజాపూర్, దంతెవాడ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్ లో 246 మంది చనిపోతే రాయ్ పూర్ డివిజన్ పరిధిలోని గరియా బంద్ జిల్లాలో మరో 27 మంది మృతి చెందినట్టు భద్రతాబలగాలు పేర్కొన్నాయి. దుర్గ్ డివిజన్ లోని మొహ్లామన్పూర్ అంబాగఢ్ చౌకీ జిల్లాలో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది మావోయిస్టు కాల్పుల్లో 23 మంది భద్రతా సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు చెప్పారు. ఘటనా స్థలం నుంచి ఒక లైట్ మెషిన్ గన్, సింగిల్ లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్), ఇన్సాస్ రైఫిల్స్, .303 రైఫిల్స్, ఇతర ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్ కౌంటర్ లో బీజాపూర్ డీఆర్జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ మోను వడాడి, కానిస్టేబుల్ దుకారు గొండే, జవాన్ రమేష్ సోధి మృతి చెందారు.

**ఆపరేషన్ కగార్ తో కకావికలం**

2026 మార్చి కల్లా మావోయిస్టు రహిత దేశంగా ప్రకటిస్తామని కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించిన తర్వాత మావోయిస్టులు కకావికలం అవుతున్నారు. కేంద్ర ప్రకటించిన ఆపరేషన్ కగార్ తర్వాత మావోయిస్టుల లొంగుబాట్లు, ఎన్ కౌంటర్ లు పెరిగిపోయాయి. దండకారణ్యంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సంభాల కేశవరావ్ తో పాటు ఎనిమిది మంది కేంద్ర కమిటీ సభ్యుల ఎన్ కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీ ఆత్మరక్షణలో పడిపోయింది. 40 సంవత్సరాలు అడవుల్లో ఉన్న మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న వంటి నేతలు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో నష్టాన్ని పూడ్చటానికి ఆయుధాలను త్యజించి ప్రజా జీవితంలో కలవాలని పార్టీ కేడర్ కు వారు పిలుపునిచ్చారు. మరో అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీని పోలీసుల అదుపులో ఉన్నట్టు ప్రజా సంఘాలు చెబుతున్నాయి. అతన్ని కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రం విధించిన డెడ్ లైన్ కంటే నాలుగు నెలలముందే మావోయిస్టు పార్టీ తుది దశకు చేరుకుందని ప్రచారం జరుగుతోంది. మావోయిస్టు పార్టీ కూడా జనవరి నుంచి ఆయుధాలను త్యజించాలని నిర్ణయించుకోవడం దీనికి తార్కాణం అని చెప్పొచ్చు.

# కోటి రూపాయల వెండి మండపంతో మోపిదేవికి శోభ!

- స్వామివారికి 49 కేజీల రజత కానుక సమర్పణ
- మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి పాను పట్నంపై మెరిసిన రజత మండపం
- ఆర్.వి.ఆర్. సంస్థ దాతృత్వం.. మోపిదేవి ఆలయంలో అద్భుత ఘట్టం

**అవనిగడ్డ, మహా:** కృష్ణాజిల్లా అవనిగడ్డ లోదినదినాభివృద్ధి చెందుతున్న మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దివ్య సముఖంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. కోటి రూపాయలకు పైగా విలువైన భారీ వెండి మండపాన్ని ఆర్.వి.ఆర్. డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అధినేత రావి వీర రాఘవ చౌదరి దంపతులు ఆలయానికి సమర్పించి, తమ నిరుపమాన భక్తిని చాటుకున్నారు.

**వైభవాన్ని పెంచిన రజత కానుక**

చారిత్రక సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి మూల విరాట్టు పాను పట్టంపై అలంకరించేందుకు ఉద్దేశించిన ఈ వెండి మండపం, పూర్వపు మండపం జీర్ణావస్థకు చేరిన నేపథ్యంలో దాతలచే సమర్పించబడింది. గతంలో స్వామివారి దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన రావి వీర రాఘవ చౌదరి దృష్టికి పురోహితులు ఈ విషయాన్ని తీసుకురాగా, వారు తక్షణమే స్పందించి, స్వామివారి వైభవానికి అద్దం పట్టేలా నూతన మండపాన్ని తయారు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు, సుమారు 49 కిలోల స్వచ్ఛమైన వెండితో, కోటి రూపాయలకు పైగా (ఖచ్చితంగా 1,01,53,000) విలువైన శిల్పకళా అద్భుతమైన మండపాన్ని అత్యంత నిష్ఠతో తయారు చేయించారు.

**వేదమంత్రాల మధ్య అలంకరణ**

గురువారం నాడు జరిగిన ఈ మహత్తర కార్యక్రమంలో, రావి వీర రాఘవ చౌదరి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఆలయ కార్యదర్శి దాసరి శ్రీరామ వరప్రసాదరావు సమక్షంలో, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నూతన వెండి మండపాన్ని స్వామివారికి అలంకరించారు. ఈ దృశ్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

**ప్రముఖుల ప్రశంసలు**

ఈ వెండి మండపం సమర్పణ వేడుకకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ఆర్.వి.ఆర్. సంస్థ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి పట్ల కనబర్చిన ఈ భక్తి, దైవ సేవకు ప్రతీకగా నిలుస్తుంది" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కమిషన్ చైర్మన్ పట్టాభి, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలలో భాగస్వాములయ్యారు. ఈ రజత మండపం మోపిదేవి క్షేత్రం యొక్క ఆధ్యాత్మిక శోభను మరింత పెంచింది.

# సర్కారీ బడిలో సరికొత్త టెన్షన్

## టీచర్ల డుమ్మాకు ఎఫ్ఆర్ఎస్ అడ్డుకట్ట

- 30 రోజులు గైర్హాజరైతే ఉద్యోగం కోల్పోవాల్సిందే
- లక్షా పదివేల మంది టీచర్లపై విద్యాశాఖ 'ఉక్కుపాదం'!
- విద్యార్థుల భవితవ్యం కోసం కఠిన వైఖరి.. 50 మంది తొలగింపు!
- ఖమ్మం జిల్లాల్లో మిగులు టీచర్లు.. అటు 'డుమ్మా' ఇటు 'కొరత'
- గురువుల నిర్లక్ష్యానికి సాంకేతికతతో సంకెళ్లు
- విద్యావ్యవస్థలో సంస్కరణల పర్వం



**ఖమ్మం బ్యూరో, మహా:** రాష్ట్రంలోని సుమారు లక్షా పదివేల మంది సర్కారు స్కూల్ టీచర్లలో కొందరు ప్రదర్శిస్తున్న బాధ్యతారాహిత్యం, ప్రభుత్వ విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. నెలల తరబడి ముందస్తు అనుమతి లేకుండా తరగతి గదులకు డుమ్మా కొట్టడం వల్ల అనేక పాఠశాలల్లో కీలకమైన సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడి, లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ తీవ్ర సమస్యకు చెక్ పెట్టడానికి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఇప్పుడు ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ అనే సాంకేతిక అస్త్రాన్ని వినియోగించి, విద్యారంగంలో ఒక చారిత్రక ప్రక్షాళనకు తెరలేపింది. ఈ వ్యవస్థ ద్వారా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండటానికి విద్యాశాఖ ఇచ్చిన చివరి హెచ్చరిక ఇది. ముప్పై రోజులు గైర్హాజరైతే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందనే కఠిన నిర్ణయం, రాష్ట్రంలోని 24 వేల ప్రభుత్వ పాఠశాలల వాతావరణాన్ని పూర్తిగా మార్చివేసింది.

**30 రోజులు గైర్హాజరైతే తక్షణమే షోకాజ్ నోటీసులు**

ప్రభుత్వ పాఠశాలల్లోని హాజరు సమస్యను తీవ్రంగా పరిగణించిన స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్, ఇకపై టీచర్లు ఎవరైనా ముందస్తు అనుమతి లేకుండా 30 రోజులు వరుసగా స్కూల్‌కు రాకపోతే, వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఇటీవల జరిగిన డీఈఓల సమావేశంలో డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ మేరకు జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ నోటీసులకు సంబంధిత టీచర్ ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారు. సరైన కారణం లేకుండా విధులకు డుమ్మా కొట్టినట్లు తేలితే, శాఖాపరమైన చర్యలు, చివరికి సర్వీసు నుంచి తొలగింపు తప్పదని విద్యాశాఖ హెచ్చరిస్తోంది.

**డుమ్మా టీచర్లకు తప్పని శిక్ష**

గతంలో ఉపాధ్యాయుల అటెండెన్స్ వివరాలను రిజిస్టర్ల ద్వారా తెలుసుకునేందుకు హెడ్మాస్టర్, ఎంఈఓ, డీఈఓల మధ్య సమాచారాన్ని సేకరించడానికి చాలా సమయం పట్టేది. కానీ, రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చిన ఎఫ్ఆర్ఎస్ విధానంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ సాంకేతిక వ్యవస్థతో ఎవరెవరు రెగ్యులర్‌గా రావడం లేదనేది క్షణాల్లో గుర్తించే అవకాశం ఏర్పడింది. డుమ్మా కొడుతున్న టీచర్ల డేటాను స్టేట్ ఆఫీసు నుంచే అధికారులు ప్రతినెలా క్రోడీకరించి ఆయా జిల్లాల డీఈఓలకు పంపిస్తున్నారు. ఈ కఠిన పర్యవేక్షణ కారణంగా బడుల్లో టీచర్ల హాజరు శాతం అనూహ్యంగా పెరిగింది.

**ఖమ్మం జిల్లాల్లో మిగులు టీచర్ల సమస్య**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 24,238 ప్రభుత్వ పాఠశాలల్లో, 1.08 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఈ గణాంకాలు ఒకవైపు ఉంటే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం మరో సమస్య తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలో 1,269 సర్కారీ బడుల్లో 4,885 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నప్పటికీ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండాల్సిన దానికంటే ఏకంగా 1,521 మంది అదనంగా (మిగులు) ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు కొన్ని బడుల్లో సబ్జెక్టు టీచర్ల కొరత విద్యార్థులను వేధిస్తుంటే, మరోవైపు ఖమ్మం వంటి జిల్లాల్లో ఇంత పెద్ద సంఖ్యలో మిగులు ఉపాధ్యాయులు ఉండటం విద్యా వ్యవస్థ ముందున్న పెద్ద సవాలును ఎత్తి చూపుతోంది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు త్వరలో భారీ స్థాయిలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది.

**గతంలో 50 మంది తొలగింపు ఉదంతం పునరావృతం కాకూడదు**

విద్యాశాఖ తన నిర్ణయాన్ని అమలు చేయడంలో ఎంత కఠినంగా ఉంటుందో గత ఉదంతాలు నిరూపిస్తున్నాయి. గత రెండేండ్లలో నిబంధనలకు విరుద్ధంగా విధులకు హాజరుకాని దాదాపు 50 మంది టీచర్లను విద్యాశాఖ సర్వీసు నుంచి తొలగించింది. భవిష్యత్తులోనూ ఇదే కఠిన వైఖరి కొనసాగుతుందని, టీచర్లు తమ విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా తీవ్ర పరిణామాలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ తీసుకున్న ఈ కఠిన నిర్ణయాల వల్ల పాఠశాల విద్య మరింత బలోపేతం అవుతుందని, విద్యార్థులు మెరుగైన విద్యను అందుకుంటారని విద్యా వేత్తలు విశ్వసిస్తున్నారు.

# రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** శ్రీనివాసుపై అక్రమాస్తులు ఉన్నట్లు ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ అధికారులకు సోదాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఏడీ సర్వేయర్ శ్రీనివాస్ పై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ , రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలో, ఏక కాలంలో ఆరు ప్రాంతాల్లో సోదాలు చేయడం జరిగింది. దీంతో కలెక్టరేట్ కార్యాలయంలో ఒకసారి కలకలం చెలరేగింది. క్షేత్ర స్థాయి అధికారులు మొదలుకొని, ఐఎఎస్ అధికారుల వరకు పట్టు పడుతుండటంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఏడీ సర్వేయర్ శ్రీనివాస్ పై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని ల్యాండ్ సర్వే కార్యాలయంలో సోదాలు కొనసాగుతుండగా, గచ్చిబౌలిలోని మైత్రి హోమ్స్, ఆయన ఇంటిపై సోదాలు చేపట్టారు. పెద్ద ఎత్తున అక్రమాస్తులు సంపాదించినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. పలుచోట్ల షెల్ కంపెనీల పేరుతో వ్యాపారాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంతో పాటు రాయ్ దుర్గం, మై హోమ్ బుజాలో సోదాలు కొనసాగించారు. రంగారెడ్డి కలెక్టర్ లో ఏసీబీ దాడులు కొనసాగడం ఇది రెండవసారి. 2024 ఆగస్టు మాసంలో అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి పై సైతం ఏసీబీ దాడులు జరిగాయి. ఎడి సర్వేయర్ శ్రీనివాస్ పై అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపణలతో ఏకకాలంలో ఆరు ప్రాంతాల్లో దాడులు కొనసాగాయి.

**రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్ అరెస్ట్**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గురువారం ఆయన్ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడీ శ్రీనివాస్ ఇళ్లు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేస్తున్నారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు జరుపుతున్నారు. ఏడీ శ్రీనివాస్‌కు రాయదుర్గం మైహోం భుజాలో ఫ్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, ఏపీలోని అనంతపురంలో మరో 11 ఎకరాల వ్యవసాయ భూమి, మహబూబ్‌నగర్‌లో నాలుగు ఎకరాలు, నారాయణపేటలో మూడు ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాదు.. ఇంట్లో రూ.5 లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, రెండు విలువైన కార్లు, పలు పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



# విద్యార్థి నేత నుంచి కరీంనగర్ డిసిసి అధ్యక్షుడిగా..

- నేడు డిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న మేడిపల్లి..
- హాజరుకానున్న మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం , అడ్లూరి

**కరీంనగర్, మహా:** ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎగిసిన కెరటం.. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో అంచలంచలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి సంఘం నేతగా కీలకపాత్ర పోషించారు. స్వరాష్ట్ర సాధనలో ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకెళ్లిన వారిలో ఆయన ఒకరు. ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘం నేతగా రాజకీయాల్లో ప్రవేశించారు. అసెంబ్లీలోకి అడుగుపెట్టిన ఏకైక విద్యార్థి నాయకుడు. చొప్పదండి ప్రజల విశ్వాసాన్ని చురగొన్నారు. తన జీవిత లక్ష్యాన్ని సాధించారు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. విద్యార్థి స్థాయి నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై..డిసిసి అధ్యక్ష పదవినీ అధిరోహించారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు. ఎమ్మెల్యేగా చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు అహర్నిశలు పాటుపడుతున్నారు. విద్య వైద్య రంగంలో ముందు ఉంచుతున్నారు. చొప్పదండినీ ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చే దిశగా ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఆయనే చొప్పదండి ఎమ్మెల్యే కరీంనగర్ నూతన డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం..డిసిసి అధ్యక్షుడిగా నియమితులైన మేడిపల్లి సత్యం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో శుక్రవారం నాలుగు గంటలకు పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ తో పాటు ఎమ్మెల్యేలు ముఖ్య నేతలు హాజరవుతున్నారు. వారి సమక్షంలో మేడిపల్లి సత్యం డిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# బార్ అసోసియేషన్ అధ్వర్యంలో దంతూరి సత్తయ్యకి ఘన సన్మానం


**ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష హాజరు**



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండల అదనపు కోర్టుకి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా ఎంపికై బాధ్యతలు చేపట్టిన దంతూరి సత్తయ్య కి రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ.మస్జిద్ అధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సభ్యులందరూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష హాజరయ్యారు. అనంతరం వారూ మాట్లాడుతూ జ్యుడిషియల్ వ్యవస్థలో నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అవకాశాలు ఉంటాయని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మాతో పాటు కలసి పని చేసిన ఉన్నత హోదాలో వెల్లినందున సభ్యులందరూ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ యాపాల కృష్ణ రెడ్డి, కంపాటి యాదగిరి, జినుకల ప్రభాకర్, కేమా రామదాసు, ఉయ్యాల హనుమంతు గౌడ్, బర్ల డేవిడ్, నకిరేకంటి మోగులయ్య, యాదాసు యాదయ్య, దినేష్ కుమార్, మామిడి వెంకట్ రెడ్డి, నోముల స్వామి, ఏళ్ల శ్రీశైలం, కూనురూ శ్రీనివాస్, ఎండీ. అజిజోద్దిన్, మహిళ న్యాయవాది రజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ వేదికగా తెలంగాణ రహదారుల ప్రస్తావన..

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా గురువారం ఢిల్లీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టుల అంశం పార్లమెంట్ ప్రాంగణంలో చర్చకు వచ్చింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గురువారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్‌లోని కేంద్ర మంత్రి ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన రోడ్డు రవాణా అంశాలపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్ర కేంద్ర మంత్రికి ప్రత్యేక విజ్ఞాపన పత్రాలను అందజేశారు. తెలంగాణ వ్యాప్తంగా మంజూరై, వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల పనులకు తక్షణమే నిధులు కేటాయించాలని ఆయన కోరారు. నిధుల కొరత వల్ల పలుచోట్ల పనులు మందకొడిగా సాగుతున్నాయని, దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేవలం ప్రతిపాదనలకే పరిమితం కాకుండా, నిధుల విడుదలలో వేగం పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న రహదారుల పనులను కూడా వేగవంతం చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వద్దిరాజు రవిచంద్ర కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కనెక్టివిటీని పెంచేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని ఆయన నొక్కిచెప్పారు. తెలంగాణలో రహదారుల ఆవశ్యకతను, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కల్పించాలని ఆయన చేసిన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.



## భయపెట్టించే మరో హారర్..

తెలుగులో ప్రాపర్ హారర్ మూవీ వచ్చి చాలా రోజులవుతుంది. కామెడీ హారర్ చిత్రాలు తరచు వస్తున్నాయి కానీ.. పూర్తిగా భయపెట్టే చిత్రాలేవి రావట్లేదు. ఇప్పుడు ఆ లోటును తీర్చేందుకు 'ఈషా' వచ్చేస్తుంది. త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రూపొందిన హారర్ థ్రిల్లర్‌కి శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్‌తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. సరికొత్త థ్రిల్లింగ్ అంశాలతో ఈ సినిమాను తెరకెక్కించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది. ఒక నిమిషం రెండు సెకన్ల నిడివి గల ఈ గ్లింప్స్ చూస్తేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఆత్మలు ఉన్నాయా లేదా అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కించినట్లు తెలుస్తోంది.



## తెలంగాణలోనూ భారీగా టికెట్ ధరల పెంపు

బాలయ్య మూవీ అఖండ2 సినిమా టికెట్ల పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇప్పటికే ఏపీలో భారీగా టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించగా.. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం అనుమతులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 ఒక్కో టికెట్‌పై పెంచుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడు రోజుల పాటు ఈ ధరలు అమల్లో ఉంటాయని పేర్కొంది. అంతేకాకుండా డిసెంబర్ 4న ప్రదర్శించే ప్రీమియర్స్‌కు కూడా పర్మిషన్ ఇచ్చింది. ఈ ఒక్క షోకు ఏకంగా రూ.600 వసూలు చేసుకునే అవకాశం కల్పించింది. ఇలా ఇష్టమొచ్చినట్లుగా టికెట్ ధరలకు అనుమతులు ఇవ్వడంపై సగటు సినీ ప్రియులు మండిపడుతున్నారు.

### ఏపీలో భారీగా ధరల పెంపు..

ఏపీలో ఇప్పటికే అఖండ2 మూవీ టికెట్ ధరలు పెంపునకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. సింగిల్స్ స్క్రీన్స్‌లో రూ.75, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంచుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీమియర్ షోలకు అనుమతి ఇవ్వడంతో పాటు.. ఏకంగా రూ.600లుగా టికెట్ ధరలను నిర్ణయించింది. ఈ నిర్ణయంపై సగటు సినీ ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పెళ్లి వార్తలపై స్పందించిన రష్మిక

పెళ్లి వార్తల గురించి నటి రష్మిక స్పందించారు. విజయ్ దేవరకొండతో ఇప్పటికే నిశ్చతార్థం కూడా చేసుకున్నట్లు బలంగానే వార్తలు కూడా వచ్చాయి. కానీ, వారిద్దరూ మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. అయితే, ఫిబ్రవరిలో వారు పెళ్లి చేసుకోనున్నట్లు సోషల్‌మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఒక ఇంటర్వ్యూలో రష్మిక స్పందించారు. తన పెళ్లి గురించి వస్తున్న రూమర్స్‌ను ఖండించలేనని అంటూనే ఆ వార్తలను ఇప్పుడే ధ్రువీకరించలేనని అన్నారు. అయితే, పెళ్లి గురించి తప్పకుండా సరైన సమయం, ప్రదేశంలో మాట్లాడుతానని క్లారిటీ ఇచ్చారు. ఈ సంతోషకరమైన వార్తను అందరితో పంచుకున్న తర్వాతే పెళ్లి చేసుకుంటానన్నారు. ఇంతకుమించి పెళ్లి గురించి చెప్పలేనని రష్మిక పేర్కొన్నారు. తన వ్యక్తిగత విషయాలను బయటి ప్రపంచానికి చెప్పేందుకు పెద్దగా ఇష్టపడనని రష్మిక అన్నారు. తాను ఇంట్లో ఉన్నప్పుడు సినిమాలకు సంబంధించిన విషయాలను పంచుకోనన్నారు. అదే విధంగా బయటకు వచ్చినప్పుడు వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడనన్నారు. ఈ ఏడాది తన జీవితంలో చాలా ఎంతో ప్రత్యేకమైనదని ఆమె అన్నారు. 2025లో తాను నటించిన ఐదు సినిమాలు విడుదలై ప్రేక్షకుల నుంచి మంది ఆదరణ పొందడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని రష్మిక అన్నారు.



## పారితోషికం భారీగా పెంచేసిన సాయిపల్లవి



డాక్టర్ కావాలనుకుని యాక్టర్ అయినవారిలో హీరోయిన్ సాయిపల్లవి ఒకరు. చిన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగింది. ఈమె మలయాళంలో నటించిన ప్రేమమ్ అనూహ్య విజయాన్ని సాధించింది. ఆ తర్వాత ఈ నేచురల్ బ్యూటీకి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలు ఎర్ర తివాచీ పరిచాయి. మంచి క్లాసికల్ డ్యాన్సర్ అయిన సాయిపల్లవి మొదటినుంచి గ్లామర్‌ను దరి చేరనీయకుండా జాగ్రత్త పడుతూ పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. అంతేకాకుండా ఈమె నటించిన చిత్రాలు మంచి విజయాన్ని సాధిస్తుండటంతో బోలెడంత క్రేజ్ వచ్చింది. తెలుగులో నాగచైతన్యకు జంటగా నటించిన తండేల్, తమిళంలో శివకార్తికేయన సరసన నటించిన అమరన్ ఘన విజయాలు సాధించడంతో ఆమె రేంజ్ మరింత పెరిగింది. దీంతో ఈమె బాలీవుడ్‌లోనూ అడుగుపెట్టింది. అక్కడ రెండు భాగాలుగా తెరకెక్కుతున్న రామాయణ చిత్రంలో సీతగా నటిస్తోంది. దాంతో పాటు మరో హిందీ చిత్రంలోనూ నటించే అవకాశం వరించిందని సమాచారం. కొంత గ్యాప్ తర్వాత దక్షిణాది చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతోంది సాయిపల్లవి (Sai Pallavi). రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్న చిత్రంలో సాయిపల్లవి నటించనున్నారని లేటెస్ట్ టాక్. ఈ మూవీలో నటించేందుకు ఆమె అత్యధికంగా రూ.15 కోట్ల పారితోషికం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. మరి ఇదెంతవరకు నిజమన్నది తెలియాల్సి ఉంది.

# అప్పుడే నీకు పెళ్లేంటి?

కెవ్వు కేక, చయ్యచయ్య చయ్యా, మున్నీ బద్నాం హూయి.. వంటి పాటలతో దుమ్ములేపింది మలైకా అరోరా. ఆకర్షణీయమైన అందం, అదిరే స్టెప్పులతో అభిమానులను ఉర్రూతలూగించింది. ఇటీవలే థామా సినిమాలోనూ 'పాయిజన్ బేబీ' పాటలో తళుక్కుమని మెరిసింది. ఐటం సాంగ్స్ స్పెషలిస్ట్‌గా వెండితెరపై ఓ వెలుగు వెలిగిన ఈ బ్యూటీ పర్సనల్ లైఫ్‌లో మాత్రం ఎన్నో ఒడిదుడుకులను చూసింది.

### పెళ్లి - విడాకులు

ఓ కాఫీ యాడ్ షూట్‌లో బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ సోదరుడు, నటుడు అర్బాజ్ ఖాన్‌ను కలిసింది మలైకా. తొలిచూపులోనే ఇద్దరూ ప్రేమలో పడ్డారు. వెంటనే మరేం ఆలోచించకుండా పెళ్లి చేసుకుంది. వీరికి కుమారుడు అర్హాన్ ఖాన్ సంతానం. రానురానూ దంపతుల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో 2015లో వీరిద్దరూ విడిపోయారు.

### యంగ్ హీరోతో డేటింగ్

అనంతరం తనకంటే వయసులో 12 ఏళ్లు చిన్నవాడైన హీరో అర్జున్ కపూర్‌తో ప్రేమలో పడింది. కొన్నేళ్లపాటు డేటింగ్ చేసిన వీరు ఆ తర్వాత సడన్‌గా బ్రేకప్ చెప్పుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ హర్ష మెహతా అనే వ్యాపారితో ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా మలైకా అరోరా ఓ ఇంటర్వ్యూలో తన తల్లి ఇచ్చిన సలహాను ఎలా పెడచెవిన పెట్టిందో చెప్పుకొచ్చింది.

### డేట్ చేసినవాడితో పెళ్లెందుకు?

ఆమె మాట్లాడుతూ.. మా అమ్మ ఎప్పుడూ జీవితాన్ని ఎంజాయ్ చేయమని చెప్తుండేది. ఫస్ట్ ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవద్దని సలహా ఇచ్చింది. కానీ, నేనదే చేశాను. నేను ప్రేమించిన మొదటి వ్యక్తినే పెళ్లాడాను. నా నిర్ణయాన్ని అమ్మ తప్పుపట్టింది. అప్పుడే పెళ్లి చేసుకుంటే నీకోసం బయట ఏం దాగి ఉందో నీకెలా తెలుస్తుంది? అని కంగారుపడింది. ఏం కాదమ్మా.. అని సర్ది చెప్పాను. మేం ఏం చేయాలనుకున్నా సరే తనెన్నడూ అడ్డు చెప్పలేదు.

### మగవాళ్లను తప్పుపట్టరు

కానీ ఈ ప్రపంచంలో మగవాడు ఏం చేయాలనుకున్నా ఎవరూ తప్పుపట్టరు. విడాకులు తీసుకున్నా.. తన వయసులో సగం ఏజ్ ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకున్నా సరే.. వావ్ అని పొగుడుతారు. అదే పని మహిళ చేస్తే మాత్రం ఆమెను నానామాటలంటారు. అంతెందుకు? ఆడవాళ్లు ధైర్యంగా నిలబడి ముందుకెళ్తుంటే కూడా చూసి ఓర్వలేరు అని మలైకా అరోరా చెప్పుకొచ్చింది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034